క్లుప్తంగా

31 అడుగుల ప్రతిమ ఏర్పాటుకు నిర్ణయం



పామర్రు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వినాయక చవితి నవరాత్రులు ప్రారంభించి 31 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 31 అడుగుల మట్టి వినాయక ప్రతిమను ఏర్పాటు చేయాలని శనివారం జరిగిన ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు సమావేశంలో తీర్మానించారు. ఈ నేపథ్యంలో ప్రచురించిన కరపత్రాలను ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు బొగ్గరపు సాయిబాబు, తాళ్లూరి నరేష్, ఘంటసాల త్రినాథ్, ఘంటసాల సాయిరాం, బొగ్గరపు బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



అడ్డాడ(పామర్రు): విద్యార్థులలో అంతర్గతంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ సైన్సు అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూల్‌లో శనివారం గణిత విజ్ఞాన మేళా నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని పలురకాల ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పామర్రు మండల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఈ గణిత విజ్ఞాన మేళాను సందర్శించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌ర మణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 జీ పద్మవాణి, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ



గుడివాడ టౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పోస్టల్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇల్లు, దుకాణం ఇతర ప్రాంతాల్లో జాతీయ జెండా ఎగరాలనే సంకల్పంతో రూ.25కే జాతీయ జెండాను పోస్టాఫీస్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

164 మందికి కళ్ల జోళ్లు పంపిణీ

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో అమరావతి సేవా ఫౌండేషన్ ద్వారా సుమారు 164 మందికి కళ్లజోళ్లను శనివారం అందజేశారు. సంస్థ సభ్యులు సూరపనేని సత్యనారయణ మాట్లాడుతూ గ్రామంలో కొద్ది రోజుల క్రితం విజయవాడ ఎల్‌వీ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారని తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన 164 మందికి కళ్లజోళ్లు అందజేశామని వివరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ప్రపంచ యువకుల దినోత్సవం సందర్భంగా చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ సీహెచ్ నాగలక్ష్మి మాట్లాడుతూ హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలను గ్రామంలోని యువతకు తెలియజేశారు.

దక్కనున్న హక్కులు

- పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కృషి
- 50 ఏళ్ల సమస్యకు పరిష్కారం
- 25 మందికి పట్టాలిచ్చేందుకు జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం



ఎస్సీలు సాగు చేసుకొంటున్న అసైన్డ్ భూమి

పమిడిముక్కల: దశాబ్దాల కల నెరవేరింది. ఒకటి కాదు రెండు కాదు 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కృషితో సాకారమైంది. భూమిపై ఎలాంటి హక్కు లేని స్థితి నుంచి సంపూర్ణ హక్కు కల్పించేందుకు భరోసా ఇచ్చింది. అవనిగడ్డలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ సమక్షంలో జరిగిన జిల్లా ఎసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో 25 మంది దళితులకు పట్టాలివ్వాలని నిర్ణయం తీసుకొన్నారు. త్వరలో పట్టాలు లభించనుండటంతో చోరగుడి శివారు గోపాలకృష్ణాపురం దళిత రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మూడు తరాలుగా సాగు..

చోరగుడి శివారు గోపాలకృష్ణాపురంలో 400 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి చెందిన 25 మంది దళితులు పక్కనే ఉన్న ఐదెకరాల భూమిని మూడు తరాల నుంచి సాగు చేసుకొంటున్నారు. భూమిపై ఎలాంటి హక్కు లేకపోవడంతో వారికి ఏవిధమైన రాయితీలు రావడం లేదు. ఇప్పుడు హక్కు కల్పించడంతో వారికి భూమిపై హక్కు లభించనుంది. ప్రభుత్వం అందించే రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలు వీరికి లభించనున్నాయి.

గత ప్రభుత్వంలో కోరినా..

గత ప్రభుత్వంలో భూమిపై హక్కు కల్పించాలని పలుసార్లు కోరినా పట్టించుకోలేదు. దీనిని ఒక సమస్యగానే చూడలేదని అంటున్నారు. గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది.

నిర్ణయం ఇదీ..

అవనిగడ్డలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఐదెకరాల్లో 25 మందికి పట్టాలిచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఉయ్యూరు ఆర్డీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి ప్రత్యేక శ్రద్ధతీసుకుని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. ఈ మేరకు 17 మందికి 18 సెంట్లు, ఏడుగురికి 24 సెంట్లు, ఒకరికి 26 సెంట్ల చొప్పున ఇచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో 50 ఏళ్ల సమస్యకు మోక్షం కలిగింది.

రైతు పక్షపాత ప్రభుత్వం



ఇది రైతు పక్షపాత ప్రభుత్వం. బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసే ప్రభుత్వం. ప్రభుత్వం జీవో జారీ చేసి వారికి భూమిపై హక్కు కల్పించింది. మంత్రికి, కలెక్టర్‌కు, జిల్లా కమిటీకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. దశాబ్దాల కల నా హయాంలో నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

–ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

థాంక్యూ సీఎం సార్..



మూడు తరాలుగా ఆ భూమిని మేము సాగు చేసుకొంటున్నాం. నా హయాంలో హక్కు రావడం సంతోషంగా ఉంది. పిల్లలను బాగా చదివించు కుంటాను. మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. 50 ఏళ్ల ఎదురు చూపులు నేడు ఫలించాయి. థ్యాంక్యూ సీఎం సార్.. థ్యాంక్యూ అనిల్ సార్ అని ఆనందం వ్యక్తం చేశాడు.

– బంద్రపల్లి నాగరాజు, గోపాల కృష్ణాపురం, లబ్దిదారుడు

రుణపడి ఉంటాం..



భూమిపై హక్కు కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మా మొర ఆలకించారు. మా సమస్య పరిష్కరించారు. ఆయనకు జీవితాంతం రుణ పడి ఉంటాం. మా పల్లెలో పండుగ వాతావరణం నెలకొంది.

–కనుమూరి నాగరాజు, లబ్ధిదారుడు, గోపాల కృష్ణాపురం

సంక్షేమ రాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- భద్రిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



భద్రిరాజుపాలెంలో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: సంక్షేమరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన శనివారం ఉత్సాహంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని అనిల్‌కుమార్ చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి గడప గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఆయనదేన్నారు. ప్రతిపక్షాలు చేసే అసత్య ఆరోపణలు నమ్మొద్దని, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వర రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, పీఏసీఎస్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యన్నారాయణ, వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి ముందే నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో ఓటరు జాబితాల పరిశీలన అధికారులకు అందజేయాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నాటికి పరిశీలన పూర్తిచేసి సమాచారం ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉందన్నారు. వెరిఫికేషన్‌లో ఏమైనా లోపాలున్నా సరిచేసుకోడానికి కొంత సమయం కావాల్సి ఉన్నందున ఈనెల 16 నాటికే పరిశీలన పూర్తికావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, ఎలక్షన్ డిటీ లోకరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుంటుంబానికి చెక్కు అందజేత



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ఇటీవల ప్రమాదవశాత్తూ కాలువలోపడి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రూ.50 వేల విలువైన చెక్కును అందజేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఈ చెక్కును అందజేశారు. మండలంలోని పసుమర్రు గ్రామ శివారు గంగుల వాని చెరువుకు చెందిన గుంటూరు గంగాధరరావు ఇటీవల పుల్లేరు కాలువలో జారి పడి మృతి చెందాడు. గంగాధరరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించిన సందర్భంగా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఈ ఘటనను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు దృష్టికి తీసుకెళ్లి సహాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ రాజాబాబు మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.50 వేలు మంజూరు చేశారు. ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాము, తోట్లవల్లూరు మండలం ఆర్బీకే అధ్యక్షుడు నడకుదురు రాజేంద్ర తదదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

పామర్రు: స్థానిక సర్పంచి కే కస్తూరి ఆదేశాల మేరకు గ్రామంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టారు. దోమల లార్వా నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. మురుగు గుంతల్లో కెమికల్ బాల్స్ వేస్తున్నారు. దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని కార్యదర్శి సలీం, శానిటేషన్ మేస్త్రి మాదుగుల శివనాగు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుందాం

ఎమ్మెల్యే డీఎన్నార్



తామరకొల్లు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : నా భూమి–నా దేశం కార్యక్రమం ద్వారా నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అర్పించడం, స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవడం మన అందరి విధి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా తామరకొల్లు, వింజరం గ్రామాల్లో శిలాఫలకాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలాల వల్ల స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి పంపించడానికి మన ప్రాంతంలో మట్టిని సేకరించడం గొప్ప విషయమన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్‌లు భట్రాజు శివాజి, ధర్మరాజుల నాగమణి, పీఏసీఎస్ అధ్యక్షుడు కుర్మా నెహెమియా, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నాయకులు ఉలిసి సీతారామాంజనేయులు, ధర్మరాజుల సూర్యనారాయణ, సోబుల వీర వెంకట సత్యనారాయణ, బోడావుల అప్పయ్య, మీగడ సత్యనారాయణ, గోదావరి యాదవరాజు, అమిరపు సుబ్బారావు, కురేళ్ళ ప్రభుదాస్, మనిమాల రాజేష్, తోకల జ్యోతి, నున్న శ్యామలరాజు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కైకలూరు : లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్ శివారు జగనన్న గ్రీన్ విలేజ్, ఆటపాక గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. ప్రభుత్వం రూ.లక్షల విలువ కలిగిన స్థలాలను ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణాలకు నగదు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కన్నా రమేష్, సింగంశెట్టి రాము, కన్నా బాబు, సిద్ధాబత్తుల శ్రీరామమూర్తి, పోతన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ఎమ్మెల్యే డీఎన్నార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లిలో రూ.9.24 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లను శనివారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. ఈ నిధులతో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించి ప్రణాళికలు తయారుచేసి పంపిస్తే నిధుల విడుదలకు కృషి చేస్తానన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బొజ్జ సుందరరావు అనే దివ్యాంగుడు ఇంటి నిర్మాణానికి సాయం కోరగా సొంతంగా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, ఎంపీటీసీలు జంపాన కోటేశ్వరరావు, మరీదు నాగయ్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, కరేటి గోవిందరాజులు, సాయిబాబు, రాచూరి కుమార్, కొల్లి నాని, దివి సతీష్, భూపతి రవీంద్ర, గణేషుల సురేష్, ఎంపీడీవో పీ మల్లీశ్వరి, విద్యుత్ ఏఈ రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘ నేతగా రసూల్



మస్తాన్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న రసూల్

కొర్నిపాడు(పెదపారుపూడి): మండలంలో కొర్నిపాడు గ్రామంలోని మసీద్‌లో పామర్రు నియోజకవర్గ దూదేకుల ముస్లిం సంఘ అధ్యక్ష ఎన్నిక శనివారం నిర్వహించారు. నియోజకవర్గ నూర్‌బాషా దూదేకుల సంఘం అధ్యక్షుడిగా షేక్ రసూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు పులిమద్ది చిన్న మస్తాన్ సమక్షంలో నిర్వహించి, నిమయాక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలి



మాట్లాడుతున్న గ్రామస్తులు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం వెంకటరాఘవాపురంలోని శ్మశానస్థలం ఆక్రమించి నిర్మించిన షెడ్డును వెంటనే తొలగించి శ్మశాన స్థలాన్ని అప్పగించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని అన్ని పార్టీలకు చెందిన పెద్దలు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణలను గ్రామ సర్పంచి సమర్థించడం తగదన్నారు. సర్వే నంబర్ 141, 142 శ్మశాన భూమిగా రికార్డులు ఉన్నాయని తరతరాలుగా హిందువులు, క్రైస్తవులు ఈ స్థలాన్ని శ్మశానంగా వాడుకుంటున్నామన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించి షెడ్ నిర్మించడాన్ని అడ్డుకోగా గ్రామ ప్రజల ప్రతినిధిగా ఉంటున్న సర్పంచ్ ఆక్రమదారుని సమర్థించడం విడ్డూరంగా ఉందన్నారు. కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదుచేసిన వ్యక్తిపై స్థలం కొలతల సమయంలో ఆక్రమణదారుడు దాడి చేస్తే సర్పంచి సమర్థించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెన్ననపూడి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ లింగం సుందరరావు, వీఆర్‌పురం గ్రామస్తులు సీహెచ్ రంగారావు, వర్రే ఏసుబాబు, అట్లూరి దేవవర ప్రసాద్, కొప్పాక నాగేశ్వరరావు, పి. రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం నాణ్యతపై విచారణ

లోపాలు లేవని వెల్లడి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సువర్ణ తదితరులు

గుడివాడ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం ఎక్కడా నాణ్యతాలోపం కనిపించలేదని శిశుసంక్షేమ శాఖ జిల్లా పీడీ ఎస్.సువర్ణ అన్నారు. స్థానిక దనియాలపేట, బావాజీమఠం, ఇతర అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె పౌష్టికాహార నాణ్యతను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరుకుల నాణ్యతా ప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయని ఓ దినపత్రికలో వచ్చిన కథనంలో వాస్తవాలు లేవని ఆమె అన్నారు. అనంతరం పౌష్టికాహారం పొందుతున్న బాలింతలు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి నుంచి సమాచారం సేకరించారు. ఏ ఒక్కరూ నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు తమ దృష్టికి తేలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాము పంపిణీ చేస్తున్న సరుకులు అన్ని ఖచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎ.విజయ ఫ్లారెన్స్, ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ పి.హరికృష్ణ, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

23 మంది యువకుల రక్తదానం



రక్త దానం చేస్తున్న రోటరీ సభ్యులు

కూచిపూడి(మొవ్వ): అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కూచిపూడి రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్య నిపుణులు డాక్టర్ హనుమంతయ్య పర్యవేక్షణలో సాగిన ఈ వైద్య శిబిరాన్ని విజయవాడ సెంటినీ హాస్పటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఏ రవికుమార్ (ఎండీ) ప్రారంభించారు. ఈ శిబిరంలో 23 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బవిరి శంకర ప్రసాద్, కూచిపూడి రోటరీ అధ్యక్ష కార్యదర్శిలు కే రామాంజనేయులు, వి.రవిబాబు, పెదసనగల్లు సర్పంచ్ కైతేపల్లి అన్నామని, సభ్యులు కోనేరు రాజేంద్రప్రసాద్, దోనేపూడి నాంచారయ్య, మద్దాల కామేశ్వరరావు, కొండవీటి అమరబాలేశ్వరరావు, పాగోలు రమేష్, పిన్నమనేని గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ముదినేపల్లి రూరల్ : స్థానిక సచివాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణామెడికల్స్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైద్యులు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, నరాల వ్యాధులు, ప్రసూతి విభాగాలకు సంబంధించిన వైద్యులు బీపీ, ఈసీజీ, ఎకో, హెచ్‌పీ లాంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యసేవల గురించి రోగులకు వివరించారు. వైద్యులు అనుపమ, మణి, రక్షిత రెడ్డి పరీక్షలు నిర్వహించగా నిర్వాహకులు హనుమార పెదబాబు, కాజా, మేదరపెట్ల సౌమ్య పాల్గొన్నారు.